మిగ్‌జాం కల్లోలం

ఆంధ్రప్రదేశ్‌లో తుఫాన్ బీభత్సం

కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు ● వేలాది ఎకరాల్లో పంట నష్టం

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ)/చెన్నై, డిసెంబర్ 5: బంగాళాఖాతం సముద్ర తీర రాష్ట్రాలను వణికించిన మిగ్‌జాం తుఫాన్ తీరం దాటింది. మంగళవారం మధ్యాహ్నం 12.30 నుంచి 2.30 గంటల మధ్య సమయంలో ఏపీలోని బాపట్ల సమీపంలో తీరం దాటిందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ సమయంలో తీరం వెంబడి గంటకు 90-100 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచాయి. మిగ్‌జాం తుఫాన్ ఏపీతో పాటు తమిళనాడులోని తీర ప్రాంత జిల్లాల్లో తీవ్ర నష్టం చేకూర్చింది. వర్షాలు, ఈదురుగాలుల తీవ్రతతో రైతులకు తీవ్ర నష్టం జరిగింది. వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. పశ్చిమ గోదావరి, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో నష్టం ఎక్కువగా జరిగింది. రాయలసీమ ప్రాంతంలోని కొన్ని జిల్లాల్లోనూ తుఫాను ప్రభావం కనిపించింది. వరి, పొగాకు, పసుపు, అరటి, పలు ఇతర పంటలు దెబ్బతిన్నాయి. భారీ వర్షాలు కురవడంతో చెరువులు, కాలువులు పొంగిపొర్లాయి. పలు చోట్ల రహదారులు కోతకు గురయ్యాయి. పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. తుఫాను ప్రభావంతో అమరావతిలోని సచివాలయంలో ప్రభుత్వ ఈ -ఆఫీస్ నెట్‌వర్క్ నిలిచిపోయింది. తుఫాన్ పరిస్థితులపై సీఎం జగన్ మంగళవారం ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తక్షణం సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తుఫాను ప్రభావిత ప్రజలకు ఆహార ధాన్యాలను పంపిణీ చేయాలని సూచించారు. తుఫాను సహాయ చర్యల కోసం ప్రభావిత జిల్లాలకు ప్రభుత్వం రూ.22 కోట్లు విడుదల చేసింది. బాపట్ల, గుంటూరు, కృష్ణా, చిత్తూరు తదితర ప్రభావిత జిల్లాల్లో హెల్ప్‌లైన్ నంబర్లు ఏర్పాటు చేసింది.

తుఫాన్ ధాటికి తిరుపతిలో ఇల్లు కూలి దెబ్బతిన్న కార్లు

చెన్నైలో నీట మునిగిన ఒక వీధిలో నడుచుకుంటూ వెళుతున్న ప్రజలు

ఒడిశా దక్షిణ జిల్లాలపైనా ప్రభావం

మరోవైపు మిగ్‌జాం తుఫాన్ తమిళనాడు రాజధాని చెన్నై నగరంతో పాటు తొమ్మిది తీర ప్రాంత జిల్లాల్లో కల్లోలం సృష్టించింది. సోమవారం కుండపోత వానలు కురవగా.. మంగళవారం కాస్త విరామం ఇచ్చాయి. భారీ వర్షాల ప్రభావంతో ప్రభావిత ప్రాంతాలు అతలాకుతలం అయ్యాయి. వరద నీరు పోటెత్తడంతో లోతట్టు జలమయమయ్యాయి. రహదారులపైకి కూడా పెద్దయెత్తున నీరు చేరడంతో జనజీవనం పూర్తిగా స్తంభించింది. విద్యుత్తు సరఫరా, ఇంటర్నెట్ సేవలకు అంతరాయం ఏర్పడింది. ఒడిశాలోని దక్షిణ జిల్లాలపై కూడా మిగ్‌జాం తుఫాన్ ప్రభావం చూపింది. మల్కాన్‌గిరి, కోరపుట్, రాయగఢ, గజపతి, గంజాం జిల్లాల్లో సహాయక చర్యల నిమిత్తం ఐదు విపత్తు నిర్వహణ బృందాలు, ఎనిమిది అగ్నిమాపక విభాగం బృందాలను రంగంలోకి దించినట్టు రాష్ట్ర స్పెషల్ రిలీఫ్ కమిషనర్ సత్యబ్రత సాహు పేర్కొన్నారు.

బోట్లు, ట్రాక్టర్ల సాయంతో..

చెన్నైతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో వర్షం సంబంధిత ప్రమాద ఘటనల్లో 12 మంది మరణించారు. మరో 11 మందికి గాయాలయ్యాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో వరద నీటిలో చిక్కుకుపోయిన వారిని సురక్షిత ప్రాంతాలకు చేర్చేందుకు సహాయక సిబ్బంది రంగంలోకి దిగారు. తుఫాను బాధితులను బోట్లు, ట్రాక్టర్లు వంటి వాటిని ఉపయోగించి ఇతర ప్రాంతాలకు తరలించారు. సహాయక, పునరావాస కార్యక్రమాల్లో ఎయిర్ ఫోర్స్, నేవీ సిబ్బంది పాలుపంచుకొన్నారు.

అమీర్‌ఖాన్‌ను కాపాడిన రెస్క్యూ సిబ్బంది

చెన్నైలోని కరప్పాకం ఏరియాలో వరదల్లో చిక్కుకొన్న పలువురు ప్రముఖులను సహాయక సిబ్బంది కాపాడారు. వీరిలో బాలీవుడు నటుడు అమీర్‌ఖాన్, మరో నటుడు విష్ణు విశాల్, బ్యాడ్మింటన్ స్టార్ గుత్తా జ్వాల తదితరులు ఉన్నారు. ఇంట్లోకి నీళ్లు చేరాయని, క్రమంగా ఉధృతి పెరుగుతున్నదని పేర్కొంటూ తాను ఉంటున్న ఏరియాలోని పరిస్థితిని వివరిస్తూ విశాల్ పెట్టిన పోస్టుకు రెస్క్యూ, ఫైర్ సిబ్బంది స్పందించారు. వారు అమీర్‌ఖాన్, విశాల్, తదితరులను వరద ప్రభావిత ప్రాంతాల నుంచి వేరే చోటుకు బోటులో తరలిస్తున్న ఫొటోలను విష్ణు విశాల్ తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. అయితే అమీర్ ఖాన్ షూటింగ్ నిమిత్తం ఇక్కడ ఉన్నారని, తమ తల్లికి ఓ దవాఖానలో చికిత్స నిమిత్తం చెన్నైలో ఉంటున్నారని కొంత మంది చెబుతుండగా.. విశాల్ నివాసం ఉండే కరప్పాకంలోని అపార్ట్‌మెంట్‌లోనే అమీర్ ఖాన్ కూడా ఉంటున్నట్టు పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి.

సోనియా నన్ను ప్రధానిని చేయరు

- కుమార్తె శర్మిష్ఠతో మాజీ రాష్ట్రపతి ప్రణబ్
- పుస్తకంలో శర్మిష్ఠ ప్రస్తావన

న్యూఢిల్లీ, డిసెంబర్ 5: 'లేదు.. ఆమె నన్ను ప్రధానిని చేయరు'.. సోనియాగాంధీని ఉద్దేశించి మాజీ రాష్ట్రపతి, కాంగ్రెస్ సీనియర్ నేత ప్రణబ్ ముఖర్జీ చేసిన వ్యాఖ్యలివి. 2004లో ప్రధాని పదవి చేపట్టడంపై ఆయన కుమార్తె శర్మిష్ఠ అడిగిన ప్రశ్నకు ప్రణబ్ పై విధంగా సమాధానమిచ్చారు. 'ఇన్ ప్రణబ్, మై ఫాదర్: ఎ డాటర్స్ రిమెంబర్స్' పేరిట తాను రాసిన పుస్తకంలో శర్మిష్ఠ ఈ విషయాలను ప్రస్తావించారు. ఈ నెల 11న ఈ పుస్తకం విడుదల కానుంది. పుస్తకంలో తన తండ్రికి సంబంధించిన కీలక విషయాలను ఆమె వెల్లడించారు. ప్రధాని పదవికి తనను తిరస్కరించినా సోనియాగాంధీపై తన తండ్రికి ఎలాంటి ద్వేషభావం లేదని పేర్కొన్నారు. అలాగే ప్రధానిగా ఎంపికైన మన్మోహన్‌సింగ్‌పైనా ఎలాంటి వ్యతిరేకత లేదన్నారు. తన తండ్రి డైరీ, తనతో స్వయంగా చెప్పిన పలు విషయాలు, తండ్రి స్నేహితులు, సన్నిహితులు, రాజకీయ మిత్రుల నుంచి సేకరించిన సమాచారం, తన పరిశోధనలు క్రోడీకరించి ఈ పుస్తకాన్ని రాసినట్టు ఆమె తెలిపారు.

భారత పౌరుడికి పాక్ అత్యున్నత పౌర పురస్కారం

ఇస్లామాబాద్, డిసెంబర్ 5: సైఫుద్దీన్ దావుదీ బోరా కమ్యూనిటీకి అధిపతి, భారత పౌరుడైన డాక్టర్ సైద్నా ముఫదల్ సైఫుద్దీన్‌కు పాకిస్థాన్ ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'నిషాన్ ఏ పాకిస్థాన్'ను అందజేసింది. మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో పాక్ అధ్యక్షుడు డాక్టర్ ఆరిఫ్ అల్వీ ఈ పురస్కారాన్ని అందజేశారు. విద్యారంగంలో ఆయన చేసిన కృషికి ఈ పురస్కారం అందించింది. యూనివర్సిటీ ఆఫ్ కరాచీలో స్కూల్ ఆఫ్ లా ఏర్పాటుకు ఆయన ఎంతో కృషిచేశారు. భారత్‌లోని అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ, జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీకి ఆయన చాన్స్‌లర్‌గా వ్యవహరిస్తున్నారు.

లాకప్‌డెత్‌లలో గుజరాత్ టాప్

- తెలంగాణలో కస్టడీ మరణాల్లేవు
- ఎన్సీఆర్బీ నివేదికలో వెల్లడి

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): గుజరాత్ రాష్ట్రం ఈ ఏడాది కూడా లాకప్‌డెత్‌లలో మొదటిస్థానంలో నిలిచింది. కాగా, తెలంగాణలో 2022లో ఒక్కటంటే ఒక్క లాకప్‌డెత్ కాలేదని స్వయంగా నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్బీ) వెల్లడించింది. గుజరాత్‌లో క్రైమ్ రేట్ కూడా పెరిగింది. పోలీస్‌శాఖ పనితీరు, సిబ్బంది విధానం, పోలీస్ స్టేషన్లలో కల్పిస్తున్న మౌలిక వసతులపై ఇటీవల ఇండియా జస్టిస్ రిపోర్టు-2023 ఇచ్చిన నివేదికలో గుజరాత్‌కు 6వస్థానం లభించింది. ఇక 14 లాకప్ డెత్‌లతో గుజరాత్ ఈసారి కూడా దేశంలోనే మొదటిస్థానంలో ఉంది. జాతీయ మానవ హక్కుల కమిషన్ నివేదిక ప్రకారం.. గత ఐదేండ్లలో గుజరాత్‌లో 94 మంది పోలీస్ కస్టడీలో మరణించారు. ఎంహెచ్‌ఏ రిపోర్టు ప్రకారం ప్రతినెలా 45 మంది మహిళలు గుజరాత్‌లో రేప్‌కు గురవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇక పోలీస్ కస్టడీ నుంచి నేరస్తులు తప్పించుకున్న కేసుల్లో మహారాష్ట్ర (104), మధ్యప్రదేశ్ (94), పంజాబ్ (76), రాజస్థాన్ (73)) ముందు వరుసలో ఉన్నాయి.



హమాస్ సొరంగాల్లోకి కృత్రిమ వరద!

హమాస్ దళాల్ని బయటకు రప్పించేందుకు ఇజ్రాయెల్ వ్యూహం

జెరూసలేం, డిసెంబర్ 5: గాజాలోని హమాస్ సొరంగాల్లో కృత్రిమ వరదల్ని సృష్టించేందుకు ఇజ్రాయెల్ సైనిక బలగాలు సిద్ధమవుతున్నాయి. సొరంగాల్లో నక్కిన హమాస్ దళాల్ని బయటకు రప్పించేందుకు ఇజ్రాయెల్ ఈ వ్యూహాన్ని ఎంచుకున్నట్టు 'వాల్‌స్ట్రీట్ జర్నల్' వార్తా కథనం వెల్లడించింది. ఈ కథనం ప్రకారం, వ్యూహం అమలుపై నవంబర్‌లో ఇజ్రాయెల్ అధికారికంగా అమెరికాతో సమాచారం పంచుకుందట. అల్ షాతీ శరణార్థి శిబిరానికి ఉత్తరాన ఐదు భారీ మోటార్ పంపుల్ని ఇజ్రాయెల్ ఆర్మీ సిద్ధం చేసిందని తెలిసింది. గాజాలోని పెద్ద పెద్ద సొరంగాలు ఇజ్రాయెల్ సైన్యానికి కొరకరాని కొయ్యగా మారాయి. అందులో బందీలతో సహా దాక్కున్న హమాస్ దళాలు ఇజ్రాయెల్‌పై బాంబు దాడులు, మిలటరీ ఆపరేషన్స్, రాకెట్ దాడులు నిర్వహిస్తున్నాయి. దీంతో ఈ సొరంగాలన్నింటినీ నీటితో నింపేయాలనే పథకాన్ని ఇజ్రాయెల్ ఎంచుకుంది. దీనికి సంబంధించి పనులు మొదలయ్యాయని, ఇది అమలుజేస్తే గాజాలో నీటి సరఫరా అంతా దెబ్బతింటుందని 'వాల్‌స్ట్రీట్ జర్నల్' కథనం తెలిపింది.

సురక్షిత నగరం హైదరాబాద్

మొదటిపేజీ తరువాయి...

సగటున 86.5 కేసులు నమోదయ్యాయి. పుణెలో 280.7, హైదరాబాద్‌లో 299.2 కేసులు నమోదైనట్టు నివేదిక వెల్లడించింది. 20 లక్షలకు పైగా జనాభా ఉన్న 19 నగరాల్లో నమోదైన కేసులను పరిగణనలోకి తీసుకొన్న ఎన్సీఆర్బీ ఈ ర్యాంకులు ఇచ్చింది. అయితే కోల్‌కతాలో మహిళలపై జరిగిన నేరాలు 2021తో(1,783 కేసులు) పోల్చితే 2022లో(1,890 కేసులు) పెరిగాయి. మహిళలపై నేరాల రేటు ఈ నగరంలో ప్రతి లక్ష జనాభాకు 27.1గా నమోదైంది. 11 రేప్ కేసులు, 34 హత్య కేసులు నమోదయ్యాయి.

తెలంగాణలో తగ్గిన మర్డర్లు

తెలంగాణ పోలీసులు తీసుకుంటున్న పటిష్టమైన చర్యల వల్ల రాష్ట్రంలో మర్డర్ల సంఖ్య భారీగా తగ్గుముఖం పట్టింది. కఠినమైన చర్యలు, వేగవంతమైన దర్యాప్తు, కఠిన శిక్షలు, చేపడుతున్న అవగాహన కార్యక్రమాల వల్ల ఏటా హత్యలు తగ్గుతున్నాయి. 2021తో పోల్చితే.. 2022లో హత్యల రేటు 12.5 శాతం తగ్గింది. ఎన్సీఆర్బీ ప్రకారం 2021లో 1,026 హత్య కేసులు నమోదవగా గత ఏడాది ఆ సంఖ్య 937కు తగ్గింది. ఈ హత్య కేసుల్లో నిందితులకు జీవిత ఖైదు పడేలా పోలీసులు చర్యలు తీసుకున్నారు. వీటితో పాటు రైల్వేలో జరిగే నేరాలు కూడా తెలంగాణలో పూర్తిస్థాయిలో అదుపులో ఉన్నట్లు ఎన్సీఆర్బీ తెలిపింది. గుజరాత్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మహారాష్ట్ర, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో రైల్వే నేరాల సంఖ్య ఏటా పెరుగుతున్నది. మహారాష్ట్రలో 2022లో 1,46,621 కేసులు నమోదుకాగా.. తెలంగాణలో 10,863 కేసులు మాత్రమే నమోదయ్యాయి.

అఫ్గాన్ తాలిబన్ ప్రభుత్వానికి చైనా గుర్తింపు

బీజింగ్: అఫ్గానిస్థాన్‌లోని తాలిబన్ ప్రభుత్వానికి దౌత్యపరమైన గుర్తింపు ఇచ్చిన తొలి దేశంగా చైనా నిలిచింది. తాలిబన్ ప్రభుత్వం చైనాకు రాయబారిగా నియమించిన బిలాల్ కరిమికి చైనా దౌత్యపరమైన హోదాను ఇచ్చింది. చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి వాంగ్ వెన్‌బిన్ మీడియాతో మాట్లాడుతూ, అంతర్జాతీయ సమాజం నుంచి అఫ్గానిస్థాన్‌ను మినహాయించకూడదని తమ ప్రభుత్వం భావిస్తున్నదన్నారు.